


# మలిసంధ్యలో.. 'ఆసరా'

## నెలనెలా ఠంచన్‌గా పింఛన్లు

ధర్పల్లి, అక్టోబర్ 14: ఏ పూటకు ఆ పూట కాయ కష్టం చేసుకుంటూ రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు కొందరివైతే, కన్నవారు లేక, మలిసంధ్యలో ఆసరాగా నిలిచేవారు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు మరి కొందరివి. అన్నీ ఉన్నా ఆదరణ లేక దీనావస్థలో కాలం గడుపుతున్న పరిస్థితి మరికొందరిది. ఇలాంటి వారందరికీ నేనున్నానంటూ ఆసరా పింఛన్లతో ఆపన్నహస్తం అందిస్తూ ప్రతి ఇంటి పెద్దకొడుకులా అండగా నిలుస్తున్నాడు సీఎం కేసీఆర్.

**సామాజిక బాధ్యతగా..**

బడుగు జీవులను, బాధితులను ప్రభుత్వం సామాజిక బాధ్యతగా ఆదుకుంటున్నది. వృద్ధులు, వితంతులు, దివ్యాంగులతో పాటు బీడీ, గీత, చేనేత కార్మికులకు పింఛన్లు అందిస్తున్నది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొదట్లో దివ్యాంగులకు రూ.1500 చొప్పున, మిగతా వారికి వెయ్యిచొప్పున పింఛన్‌ను అందించింది. 2018లో ఆ పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేసింది. దివ్యాంగులకు రూ.3 వేలు, మిగతా వారికి రూ.2,016 చొప్పున పెంచింది. ఇక, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌కు మరో వెయ్యి కలిపి నెలనెలా రూ.4,016 చొప్పున అందిస్తున్నది. ఇక, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత, చేనేత

- **బడుగు జీవితాలకు సర్కారు భరోసా**
- **వితంతులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వ చేయూత**
- **పండుటాకులకు పెద్దకొడుకుగా మారిన కేసీఆర్**
- **బీడీ, గీత, నేత కార్మికులకు సైతం పెన్షన్లు**
- **ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.05 లక్షల మంది లబ్ధిదారులు**
- **ప్రతినెలా వారికి అందుతున్న మొత్తం రూ.85.54 కోట్లు**

కార్మికులతో పాటు బోధకాలు, ఎయిడ్స్ బాధితులకు రూ.2,016 చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్ అర్హత వయస్సును కూడా కుదించింది. గతంలో 65ఏండ్లు ఉండగా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 57 ఏండ్లకు కుదించారు. తద్వారా అనేక మందికి సామాజిక పెన్షన్లు అందుతున్నాయి.

**ప్రతి ఇంట్లో పింఛన్ లబ్ధిదారు..**

సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో వృద్ధాప్య పింఛన్లు దక్కాలంటే అదో ప్రహసనంగా ఉండేది. దరఖాస్తు చేసుకున్న లక్షలాది మందిలో కొద్దిమందికి మాత్రమే బొటాబొటిన ఇచ్చే రూ.200 పింఛన్ చేతికి చిక్కేది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పింఛన్ల పంపిణీని మానవతా దృక్పథంతో చేపట్టారు. దళారులను నిలువరించడంతో పాటు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికను చేపట్టారు. ప్రతి నెలా వృద్ధులకు పింఛన్ పంపిణీతో పాటు భరోసా కోల్పోయిన ఆయా వర్గాలకు సైతం పెన్షన్ సౌకర్యం కల్పించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి కుటుంబంలోనూ ఏదో రకంగా పింఛన్ అందుతుండడం విశేషం. నిజామాబాద్ జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 2,51,910 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.52.70 కోట్లు అందుతున్నాయి. ఇక, కామారెడ్డి జిల్లాలో మొత్తం 1,53,879 మంది లబ్ధిదారులు నెలనెలా రూ.32.84 కోట్లు అందుకుంటున్నారు.



### పెద్దకొడుకులా ఆదుకుంటున్నాడు

సీఎం కేసీఆర్ ఒక పెద్దకొడుకులా ప్రతినెలా రూ.2016 అందిస్తూ మమ్ములను ఆదుకుంటున్నడు. ఈ పైసలు మాకు ఎంతగానో ఆసరాగా ఉంటున్నాయి. మా చిల్లర ఖర్చులకు ఇంట్లో కన్నబిడ్డలను పైసలు అడిగే బాధ తప్పింది. చాయినీళ్లకు, కల్లు ఖర్చులకు, ఏదైనా చిరుతిండి తినాలనిపించినా నోరు కట్టేసుకునేటోళ్లం. కానీ ఇప్పుడు ఆ బాధలేదు. ఆసరా పింఛన్ డబ్బులతో మా అవసరాలను తీర్చుకుంటున్నాం. ఇప్పుడు మాకు ఎలాంటి బాధలేకుండా పోయింది.


**- గడ్డం చిన్నగంగారాం, మైలారం, ధర్పల్లి**



### మనుమళ్లకే రూపాయి ఇస్తున్నాం

ఇది వరకు మాకు రూపాయి అవసరమైతే పిల్లలను, మనుమల్ని అడిగేవాళ్లం. పాపం వాళ్ల దగ్గర ఉంటే రూపాయి ఇచ్చేవాళ్లు. పైసలులేని టైంల ఆ బాధలో కసురుకునే వాళ్లు. అలాంటి తొక్కులాటలో ఎంతో కాలం వెల్లదీశాం. కానీ దేవుడిలా సీఎం కేసీఆర్ సార్ వచ్చినంక ఆసరా పింఛన్ రూ.2016తో మా అవసరాలు తీర్చుకుంటున్నాం. మాకే రూపాయి మిగిలితే మనవళ్లు, మనుమరాళ్లకు ఖర్చుల కోసం ఇస్తున్నాం. దీంతో పిల్లలు ఖుషీగా మా దగ్గరికి వచ్చి రూపాయి అడుక్కొని పోతున్నారు. మేము పిల్లల్ని అడుక్కునే పరిస్థితి నుంచి రూపాయి వారికిచ్చేలా మా విలువను కాపాడిన సీఎం కేసీఆర్‌కు మా ముసులోళ్ల దీవెనలు ఎప్పటికీ ఉంటాయి.


**- అంకన్నగారి ఎర్రన్న, మైలారం, ధర్పల్లి**

### పింఛన్ పైసలతోనే కాలం వెల్లదీస్తున్నా

కేసీఆర్ ఇస్తున్న పింఛన్ పైసలు రూ.2016తో కాలం వెల్లదీస్తున్నా. ప్రతినెలా వచ్చే పింఛన్ డబ్బులతో ఎలాంటి బాధ లేకుండా పోయింది. నా కొడుకులలెక్క సీఎం కేసీఆర్. గతంలో రూ.200లే పింఛన్ అచ్చేది. అవి ఏమిటికీ సరిపోయేవి కావు. మూడొద్దులు కాంగానే మళ్ల ఇండ్ల కాడ, వాళ్లకాడ చేయి చాచాల్సి అచ్చేది. కానీ ఇప్పుడు ఈ పైసలే మస్తుగా సరిపోతున్నాయి. ఏదైనా జ్వరమచ్చినా, సూది ఇప్పించుకోవాలన్నా మాకు అచ్చిన ఆసరా పింఛన్ పైసలతోనే చూపెట్టుకుంటున్నాం. ఇప్పుడు మాకు ఏమైనా అయితదన్న భయం లేకుండా పోయింది. సీఎం కేసీఆర్ సార్ యాడున్నాడో గానీ సల్లంగా ఉండాలి.

**- గజిగిరి రాజవ్వ, మైలారం, ధర్పల్లి**

### పెద్ద మనసుతో ఆదుకుంటున్నారు..

అరేక్ మైనే కేసీఆర్ సాబ్ దీయేసో పింఛన్ పైసేసే మై గుజర్ రహేహే. సీఎం సార్ మాయ సొంటి గరీబోళ్లను సల్లంగా చూడపట్టే మేము ఇంకా బతికి ఉన్నాం. మా పరిస్థితి అయితే గరీబు. గీసొంటి పరిస్థితుల్లో నాకు పొద్దు గడవడమే కష్టంగా ఉండే. కానీ సీఎం సార్ అందిస్తున్న పింఛన్ డబ్బులు ఎంతో ఆసరా అవుతున్నాయి. ఇంతమంచి కాలం నేను ఎన్నడూ జూడలే. గింతమంచిగా అందరినీ ఆదుకుంటున్న గవర్నమెంట్‌కు రుణపడి ఉంటాం.

**- ఉమర్‌ఖాన్, వృద్ధ వికలాంగుడు, ధర్పల్లి**

### పింఛన్.. మాకొక చిన్న జీతం లెక్క..



ముసలోళ్లకు పింఛన్ ఇంతగానం ఇయ్యంగ నేను ఎప్పుడూ చూడలేదు. గతంలో తీస్ రూపాయి(రూ.30), దోసవ్ రూపాయి (రూ.200)ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు రూ.2,000లు ఇవ్వడంతో మాకు చాలా సంతోషంగా ఉంది. రూ.2వేలు మాకు ఒక చిన్నజీతం చేసినోళ్ల లెక్క నెలనెలా వస్తుండడంతో ఎలాంటి బాధ లేకుండా పోయింది. మా అవసరాల కోసం పిల్లల్ని డబ్బులు అడగాల్సిన బాధ లేకుండా సీఎం కేసీఆర్ సాబ్ ఆదుకుంటున్నడు. ఇస్ లియే హమ్‌లోగ్ సబ్‌జనో కేసీఆర్ సాబ్‌కో ఓట్ డాల్‌కే ఔర్ కే బార్ ఉన్‌కో సీఎం బనాతే. హమ్‌లోగ్ కిత్‌నా సాల్ జీతేతో ఉత్‌నా సాల్ సీఎం కేసీఆర్ సార్‌కో ఓట్ డాలేతే.

**- షేక్ జమాలుద్దీన్, వృద్ధుడు, ధర్పల్లి**

**నిజామాబాద్ జిల్లాలో పింఛన్ల వివరాలు..**

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | నెలనెలా వెచ్చిస్తున్న మొత్తం (రూ.లలో) |
|---|---|---|
| వృద్ధాప్య | 53,231 | 10.73 కోట్లు |
| దివ్యాంగులు | 19,152 | 5.78 కోట్లు |
| వితంతు | 70,198 | 14.15 కోట్లు |
| చేనేత | 201 | 4లక్షలు |
| గీత | 1,047 | 21లక్షలు |
| ఒంటరి మహిళ | 9,993 | 2.01 కోట్లు |
| బీడీ కార్మికులు | 96,131 | 19.38కోట్లు |
| ఎయిడ్స్‌బాధితులు | 1,559 | 0.32లక్షలు |
| బోధకాలు | 398 | 0.08లక్షలు |
| మొత్తం | 2,51,910 | 52.70 కోట్లు |

**కామారెడ్డి జిల్లాలో పింఛన్ల వివరాలు..**

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | నెలనెలా వెచ్చిస్తున్న మొత్తం (రూ.లలో) |
|---|---|---|
| వృద్ధాప్య | 42,795 | 8.62 కోట్లు |
| వితంతు | 48,511 | 9.77 కోట్లు |
| దివ్యాంగులు | 18,195 | 5.48 కోట్లు |
| చేనేత | 632 | 12.74 లక్షలు |
| గీత | 708 | 14.27 లక్షలు |
| బీడీ కార్మికులు | 36,934 | 7.44 కోట్లు |
| ఎయిడ్స్ బాధితులు | 1,164 | 23.47 లక్షలు |
| బోధకాలు బాధితులు | 524 | 10.56 లక్షలు |
| ఒంటరి మహిళలు | 4,416 | 89.03 లక్షలు |
| మొత్తం | 1,53,879 | 32.84 కోట్లు |

- **ముగ్గురమ్మల మూలపుటమ్మ 'దుర్గమ్మ'**
- **నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు**
- **అమ్మ అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే**
- **తొమ్మిది రోజుల పాటు పూజలందుకోనున్న దుర్గాదేవి**
- **మాలధారణకు సిద్ధమైన దుర్గామాత భక్తులు**

# నవరాత్రులు నవరూపాలు



నిజామాబాద్ కల్చరల్/ నిజాంసాగర్, అక్టోబర్ 14:

**దసరా..** హిందువులకు ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ ప్యాఢమి నుంచి ఆశ్వయుజ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రి.. పదో రోజు విజయదశమి కలిసి దసరా అంటారు. ప్రధానంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నరాత్రి అంటారు. శరదృతువులో వచ్చే పండుగ కాబట్టి ఈ పేరు వచ్చింది. నవరాత్రి అనే పదం శబ్దార్థ ప్రకారంగా.. సంస్కృతంలో తొమ్మిది రాత్రులని అర్థం. నవ అంటే తొమ్మిది. రాత్రి అంటే రాత్రులు అని అర్థం. ఈ తొమ్మిది రాత్రులు.. పది రోజుల్లో.. తొమ్మిది రూపాల్లో ఉన్న శక్తి (అమ్మవారు)ని ఆరాధిస్తారు. కొందరు ఈ పండుగ మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తర్వాత మూడు రోజులు లక్ష్మీదేవి, ఆ తర్వాత మూడు రోజులు సరస్వతీ మాతకు పూజలు నిర్వహిస్తారు. నవరాత్రుల్లో సామాన్యుల నుంచి యోగుల వరకు అమ్మవారిని పూజిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. లోక కల్యాణం కోసం అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తారు. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో మహిళలు, చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ అమ్మవారిని పూజిస్తారు.


**1వ రోజు**

దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజున అమ్మవారు శైలపుత్రి రూపంలో దర్శనమిస్తారు. ఈ రోజున విశేష సంకల్పం. కలష గణపతి పూజ, బ్రహ్మకలశ స్థాపన, అమ్మవారి అలంకరణ నిత్యపూజలో లలితార్చన, మహానివేదన, నీరాజనం, మంత్రపుష్పాల సమర్పణ ఉంటుంది.



**2వ రోజు**

నవరాత్రుల్లో రెండో రోజైన సోమవారం శ్రీదుర్గా మాత బ్రహ్మచారిణి రూపంలో వెలుస్తారు. ఈ రోజు నిత్యవిధి పూజలు నిర్వహిస్తారు.




**3వ రోజు**

మూడో రోజున మంగళవారం దుర్గామాత చంద్రఘంట అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజున అమ్మవారికి నిత్యవిధి పూజలు, భక్తుల సేవలు నిర్వహిస్తారు.




**4వ రోజు**

నవరాత్రుల్లో నాలుగో రోజైన బుధవారం శ్రీమాత కూష్మాండ రూపంలో దర్శనమిస్తారు. నిత్యవిధి పూజలు, కైంకర్యాలు, ప్రసాదాల సమర్పణలు నిర్వహిస్తారు.



**5వ రోజు**

నవరాత్రులో ఐదో రోజు గురువారం శ్రీమాత స్కందమాత అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ఈ రోజున నిత్యపూజలు, అర్చనలు నిర్వహిస్తారు.



### మాల ధారణకు సిద్ధం..

దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మాలధారణ వేసుకోవడానికి నగరంలో యువకులు సిద్ధమయ్యారు. తొమ్మిది రోజుల పాటు నియమ నిష్టలతో ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుంది. క్రమశిక్షణ గల ఆధ్మాత్మిక వాతావరణంతో సర్వం సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. ఉదయం 10గంటలకు అమ్మవారి పూజ, సాయంత్రం 6గంటలకు మంగళహారతులతో ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు.



**6వ రోజు**

ఆరో రోజైన శుక్రవారం దుర్గమ్మ శ్రీకాత్యాయిని మాత అవతారంలో వెలుస్తారు. పెళ్లికాని వారు ఈ రోజు అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. ఇలా చేస్తే తప్పకుండా తగిన వరుడితో వివాహం జరుగుతుందని నమ్మకం. ఈ కాత్యాయిని అమ్మవారిని మరోరకంగా శాకాంబరి అమ్మవారిగా పూజిస్తారు.



**7వ రోజు**

నవరాత్రులో ఏడో రోజైన శనివారం అమ్మవారిని కాళరాత్రిగా సంభోదిస్తారు. ఈ అవతారాన్ని కాళికామాత రూపంగా కొలుస్తారు. ఐదు రూపాల అనంతరం అమ్మవారు తీవ్ర ఉగ్ర రూపానికి వస్తారని దేవి భాగవతంలో పేర్కొనబడింది. అమ్మవారు మిగిలిన ఈ నాలుగు రోజుల్లో కపాళ మాలలు, చేతులకు, భుజాలకు కాలకూట విషాలు కక్కే సర్పాలను అలంకార వస్తువులుగా ధరించి, నీలివర్ణంతో భీకర ఆకారంగా రాక్షసులపై దండెత్తుతుంది. ఈ సంవత్సరం మూలా నక్షత్రం సరస్వతీ నక్షత్రం కూడా 7వ రోజున రావడం విశేషం. సరస్వతీ అమ్మవారుగా దుర్గా మాత పూజలందుకుంటారు. మూలా నక్షత్రం రోజున ఏ అమ్మవారి దేవాలయాల్లో అయినా నవరాత్రుల్లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం విశేషం.



**8వ రోజు**

నవరాత్రుల్లో ఎనిమిదో రోజైన ఆదివారం దుర్గమ్మ వారు శ్రీమహా గౌరీ అవతారంలో వెలుస్తారు. ఈ అవతారంలో గౌరమ్మను సుహాసినులు ముత్తైదువ తనాన్ని కాపాడమని అమ్మవారిని వేడుకుంటారు. ఈ సంవత్సరం నవరాత్రుల్లో దుర్గాష్టమి రోజున కుమారి పూజ ( అమ్మవారిని బాలా రూపంగా) 9 సంవత్సరాల్లో పాపలను కుమారి పూజలు, తాంబూలాది వాయినాలు ఇస్తారు.



**9వ రోజు**

నవరాత్రుల తొమ్మిదో రోజు సోమవారం మహర్నవమి రోజున రాక్షసులపై అమ్మవారు అసుర సంహారిణిగా విజయాన్ని సాధించారు. ఈ విజయానికి గుర్తుగా తెల్లవారు దశమి రోజున ప్రజలు విజయ దశమి పండుగ నిర్వహిస్తారు.

